



మాట్లాడుతున్న బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య

ప్రభుత్వాస్పత్రులకు జబ్బు..



వెంటాడుతున్న సౌకర్యాల లేమి

అందని మెరుగైన వైద్య సేవలు

సామాన్యులకు ఉచితంగా వైద్య సేవలు అందించే ప్రభుత్వాసుపత్రులకు జబ్బు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమి వెంటాడుతోంది. దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సిహెచ్‌సిలు), రెండు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు ఉన్నాయి. హైరిస్కు ప్రసవాలతో పాటు పుట్టిన వెంటనే చిన్నారులకు సమస్యలుంటే కర్నూలు సర్వజన వైద్యశాలలోని చిన్న పిల్లల విభాగానికి తీసుకొస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాక తెలంగాణ రాష్ట్రం, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప, ప్రకాశం తదితర జిల్లాల నుంచి రెఫరల్ కేసులు ఎక్కువగా వస్తుంటాయి. కర్నూలు జిజిహెచ్‌లో మూడు ఎన్‌ఐసియు వార్డులు ఉండగా వాటిల్లో 60 పడకలున్నాయి. పుట్టిన వెంటనే ఏడవని పిల్లలు, బరువు తక్కువగా ఉండటం, ఇన్ఫెక్షన్, మూర్ఛ బారిన పడినవారు, గుండె, ఊపిరితిత్తుల వంటి సమస్యలకు చికిత్స అందిస్తారు. అక్కడున్న పడకల కంటే చేరే వారి సంఖ్య అధికంగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ లేక రక్త పరీక్షలు నిర్వహించడం లేదు. ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ ఒక స్టాఫ్ నర్స్ కొరతతో రాత్రి వేళల్లో అత్యవసర కాన్పు కేసులు వచ్చినప్పుడు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మహిళల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా జరుగుతుండేవి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం లేదు. దీంతో ఆపరేషన్లు చేయించుకునేందుకు పత్తికొండ, ఆదోని, కోడుమూరు వంటి ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదోని పట్టణంలో మాతా శిశుఆసుపత్రిలో పది పడకలతో నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పడకలు సరిపోక పోవడంతో ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. పత్తికొండ సిహెచ్‌సిలో సమజాత శిశువు సంరక్షణ కేంద్రం లేకపోవడంతో ఆదోని, కర్నూలు వెళ్తున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ అనుపత్రిలోని నవజాత శిశుకేంద్రంలో ఆధునిక యంత్రాలున్నా స్థలం చాలక పోవడంతో వాటిని వినియోగించకుండా మూలన పడేశారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెలా 120 నుంచి 150 ప్రసవాలు జరుగు తున్నాయి. శిశు సంరక్షణ కేంద్రం లేకపోవడంతో పెద్దాసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. డోన్ సిహెచ్‌సిలో నవజాతు సంరక్షణా కేంద్రం ఉన్నా సరైన సౌకర్యాలు లేకపోవడంతో కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. గత ప్రభుత్వం గోనేగండ్ల యుపిహెచ్‌సి స్థాయిని తగ్గించి పిహెచ్‌సిగా మార్చింది. 30 పడకల ఆస్పత్రి ఆరు పడకల ఆస్పత్రిగా మారింది. దాంతో గతంలో 8 మంది వైద్యులు ఉండగా ఆ సంఖ్య ఇద్దరికి తగ్గిపోయింది. గతంలో 10 మంది నర్సింగ్ సిబ్బంది ఉండగా ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. గతంలో 300 మంది రోజుకు ఓపి చూపించు కుంటుండగా ప్రస్తుతం 100 నుంచి 150 మంది రోగులకు మాత్రమే ఓపి చూస్తున్నారు. గతంలో కుటుంబ నియంత్రణ అపరేషన్లు చేసే వారు. ఇప్పుడు చేయక పోవడంతో ఎమ్మిగనూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఆదోని మండలం పెద్ద హరివాణం, పెద్ద తుంబలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు నిర్వహించేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం వల్లే మెరుగైన వైద్యం అందడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రయివేటులో దోచేస్తున్నారు..

పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల నుంచి కర్నూలుకు రెఫర్ చేసిన కేసుల్లో ఎక్కువగా ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడికెళ్లిన తర్వాత ఆరోగ్యశ్రీ పేరుతో దగా చేస్తున్నారు. ఆసుపత్రిలో చేర్చుకున్న తరవుఅత కొన్ని పరీక్షలకు ఆరోగ్యశ్రీ వర్తించదంటూ పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు పచ్చ కామెర్లు ఉన్నట్లు నిర్ధారణ అయితే ఫోటోథెరపీ ద్వారా చికిత్స అందించాల్సి ఉంది. అందుకు ప్రయివేటులో రోజుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇతర రోగాలకు ఆస్పత్రిలో అడ్మిట్ చేస్తే రోజుకు రూ.10 వేల నుంచి రూ.30 వరకూ వసూలు చేస్తున్నారు. దీంతో సామాన్యుల జేబు ఖాళీ అవకతప్పడం లేదు.

6, 7న కర్నూలు బాలోత్సవం

- పిల్లల్లో సృజన్మాతక పెంపునకు కృషి

- బాలోత్సవం నిర్వహణ కమిటీ - విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 6, 7న కర్నూలు నగరంలోని గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో కర్నూలు బాలోత్సవం- 4వ పిల్లల పండుగ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం రవీంద్ర పాఠశాలలో ధనుంజయ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య మాట్లాడుతూ స్వేచ్ఛా వాతావరణం లోనే పిల్లల మానసిక వికాసం పెరుగు తుందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొం దించాల్సిన అవసరం ఉందని, అందుకు బాలోత్సవం తోడ్పడుతుందని తెలిపారు. బాలోత్సవం వల్ల విద్యార్థుల మేథోశక్తి పెరుగు తుందన్నారు. మంచి దేశాన్ని, ప్రపంచాన్ని చూడా లంటే మంచి వ్యక్తులను తయారు చేయాలని, పాఠశాల స్థాయి నుంచే అధి సాధ్యం అవుతుందని చెప్పారు. ప్రతి వ్యక్తీ నేను ఎందులోనూ తక్కువ కాదు అనే విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకరశర్మ మాట్లాడుతూ పిల్లల మేధస్సు స్వచ్ఛంగా ఉంటుందని, వారిలో శాస్త్రీయ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, అందుకు తోడ్పడుతున్న బాలోత్సవం కమిటీకి అభినందనలు తెలిపారు. పాఠశాలలోనే దేశ ప్రగతి తెలిసి పోతుందన్నారు. పిల్లలను సరైన మార్గంలో నడిపించాలనుకోవడం మంచి పరిణామమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల స్మార్ట్‌ఫోన్‌కు బందీలైన పిల్లలను బయట పడేయవచ్చన్నారు. సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రయత్నం చేస్తున్న కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల జిల్లా గౌరవాధ్యక్షులు పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఉన్న సమస్యల వల్ల పిల్లలకు పాఠశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించలేకపోతున్నారని తెలిపారు. బాలోత్సవం ద్వారా పిల్లల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నా రన్నారు. బాలోత్సవం కమిటీ ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్ మాట్లాడుతూ సృజనాత్మక నైపుణ్యం, సహజ మేధస్సు, నైతికతను పెంపొం దించి విద్యార్థులకున్న నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నమే ఈ బాలోత్సవాల నిర్వహణ అన్నారు. అసమానతలు లేని సమాజం, శాస్త్రీయమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులను భాగ స్వామ్యులను చేయడం లక్ష్యమన్నారు. ఇందులో అకడమిక్ మరియు కల్చరల్ ఈవెంట్లను నిర్వహిస్తున్నామని, వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, దేశభక్తి గీతాలాపన మొదలైన 35 రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. మూడు వేదికలుగా ఈ పోటీలు జరుగుతాయని ప్రధాన వేదికకు కళ్యాణమ్మ వేదిక, రెండో వేదికకు గాదె సుబ్బారెడ్డి వేదికగా పేర్లు నిర్ణయించామన్నారు. బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్య మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభకు ఈ బాలోత్సవాలు వేదికలన్నారు. అకడమిక్ విభాగం కన్వీనింగ్ కమిటీ సభ్యులు యుఆర్ఎ రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు కర్నూలు రెవెన్యూ డివిజన్ ప్రాతిపాదికగా తీసుకున్నామని భవిష్యత్తులో బాలోత్సవాలను జిల్లా మొత్తం విస్తరిస్తామన్నారు. తొలుత ఎబిఎన్ కెమెరామెన్ సురేంద్ర మృతి పట్ల మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో బాలోత్సవం కమిటీ సభ్యులు జంధ్యాల రఘుబాబు, రంగస్వామి, రమాదేవి, జయరాజు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో కమిటీ సభ్యులు నరసింహ, ఎల్లాగౌడ్, సాయి ఉదయ్, చంద్ర మోహన్, మునిస్వామి పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో వసూళ్లు

-కార్పొరేట్ ప్రయివేట్ లో నామమాత్రంగా పరీక్షలు- ఇంటర్ బోర్డు తూతూ మంత్రంగా పర్యవేక్షణ

-నేటి నుండి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలలో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ముందస్తుగానే విద్యార్థుల నుండి కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలుడబ్బులు వసూలు చేసి పరీక్ష ఎగ్జామినర్స్ కు అందజేస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా న్యామమాత్రంగానే ప్రాక్టికల్స్ పరీక్షల పర్యవేక్షణ చేస్తున్నారు. బుధవారం నుండి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కాను న్నాయి. కర్నూలు జిల్లాలోని 91 పరీక్ష కేంద్రాల్లో దాదాపుగా15194 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్ష లకు హాజరుకానున్నారు. ఇందులో బైపిసికి చెందినవారు 4673 మంది విద్యార్థులు, ఎంపిసికి చెందిన వారు 10875 మంది విద్యార్థులు ఒకేషనల్ కు సంబంధించి 4172 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ ప్రాక్టికల్స్ పరీక్షలు గత కొన్ని ఏళ్లుగా నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్స్ నిర్వహణకు సదుపాయాలు కూడా లేకపోయినా తూతూ మంత్రంగానే చేపడుతున్నారు. విద్యార్థుల నుండి ముందుగానే కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యాలు డబ్బులు వసూలు చేసి ప్రాక్టికల్స్‌లో ఎక్కువ మార్కులు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ వినతి



విద్యార్థుల నుండి వసూలు చేసిన డబ్బులను ప్రాక్టికల్స్ నిర్వహణకు విచ్చేసే ఎగ్జామినర్సుకు ముట్టజెప్పి విద్యార్థులకు ఎక్కువ మార్కులను వేయించుకుంటున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులకు కూడా ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ సమయంలో ప్రతి కళాశాల యాజమాన్యం ఎంతో కొంత మామూళ్లను అందజేయడం ఆనవాయితీగా మారింది. ఈ మామూళ్లకు అలవాటు పడిన ఇంటర్ బోర్డు ఉన్నత అధికారులు కూడా ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చూసి చూడనట్లుగానే వ్యవహరిస్తుంటారు.



ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న దృశ్యవం (ఫైల్ ఫొటో)

ప్రతి విద్యా సంవత్సరం ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టడంలో ఉన్నతాధికారులు వైఫల్యం చెందుతున్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలల దోపిడీని అరికట్టాలి:ఎస్ఎఫ్ఐ

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు చేపడుతున్న దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రాక్టికల్స్ పేరుతో ఆసరాగా తీసుకొని కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించకుండా డబ్బులు వసూలు చేసి ఎగ్జామినర్స్‌కు ముట్ట చెబుతున్నారు. ఎవరైతే మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. ఈ ప్రాక్టికల్స్ రికార్డులపై సంతకాల నెపంతో విద్యార్థులు లైంగికంగా వేధింపులకు గురిచేయడం జరుగుతుందన్నారు. వీటిని నివారించాలంటే ప్రతి కళాశాలలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి ప్రాక్టికల్స్ పర్యవేక్షించాలన్నారు. పారదర్శకంగా నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులలో భాగంగా గ్రామంలో బంగ్లా కాలనీ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో సిసి రోడ్ల భూమి పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపిడిఓ శ్రీనివాసులు ,సచివాలయం ఉద్యోగులు, టిడిపి మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి,గ్రంథాలయ స్థల దాత రాజేంద్ర నాథ్ రెడ్డి, మండల నాయకులు విశ్వేశ్వర రెడ్డి, గ్రామ నాయకులు విజయుడు,ఖాజా మియా,శేఖర్ రెడ్డి,సుబ్బా రెడ్డి,సర్కార్, పటేళ్ల మోహన్,జాకీర్ హుస్సేన్,టిడిపి మహిళా నాయకురాలు అనీషా బేగం తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి



ఆర్‌టిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

జీవో 21ని రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పత్తికొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సెన్సార్ విధానాన్ని రద్దుచేసి, ఫిట్నెస్ లైసెన్స్ ఎఫ్సీలను పాత పద్ధతుల్లోనే నడపాలని ఆర్‌టిఒ నాగేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దస్తగిరి, ఎఐటియుసి నాయకులు రంగన్న, ఆటో వర్కర్స్ నాయకులు శేఖర్, మృగం వీరేష్, చంద్ర పాల్గొన్నారు.

చేతి పంపుకు మరమ్మత్తులు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోడుమూరులోని శాంతినగర్ కాలనీలో బోరు రిపేరీ ఉందని సిపిఎం జిపి వీరన్న ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించి చేతి పంపును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డిఈ శ్రీనివాసులు, ఏఈ ప్రసాదు, వర్క్ ఇన్స్పెక్టర్ మద్దిలేటి మరమ్మతులు చేయించారు. వారికి కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కోడుమూరు మండలంలోని ఏ సమస్య అయినా అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం చేస్తే ఇలాగే అందరూ అభినందిస్తారని సిపిఎం నాయకులు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - పత్తికొండ


పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో ఈనెల 6, 7 తేదీలలో భద్రకాళి వీరభద్ర స్వామి జాతర పురస్కరించుకొని అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పత్తికొండ అర్బన్ సీఐ జయన్న పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో పత్రికా విలేకరుల సమావేశంలో అర్బన్ సీఐ జయన్న మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జాతరను జరుపుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీ, ఆలయాల దగ్గర, ప్రధాన రోడ్డు మార్గాలు, రద్దీ ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గొడవలను సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్త వ్యక్తులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9121101129 సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

- సచివాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని రెండవ వార్డు పరిధిలోని సచివాలయం ముందు ధర్నా చేసి అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఒక్కొక్కరికి ఐదు సెంట్లు స్థలం ఇచ్చి రూ.పది లక్షలు సబ్సిడీతో కూడిన రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలలో నగరానికి దగ్గరగా ఉన్న స్థలాలను పరిశీలించి ప్రభుత్వ వారు లేఅవుట్లు ఇస్తే అనుకూలంగా ఉంటుందన్నారు. రోజు వారి కూలి నాలి పని చేసుకుని బతికే పేదలందరికీ ఉపయోగకరంగా ఉండేటట్లుగా ఇళ్ల స్థలాల భూములను పరిశీలించాలని కోరారు. గతంలో ఉన్న జగన్ ప్రభుత్వం జగనన్న కాలనీ పేర్లతో ప్రజలను ఇళ్ల స్థలాలు ఇల్లు కట్టించి ఇస్తామని మోసం చేసిందన్నారను. నగరంలో చాలామంది పేద, బడుగు బలహీన వర్గాల వారు ఉన్నారని అటువంటి వారికి ఇంటి బాడుగలు పట్టణ ప్రాంతాలలో అపార్టుమెంట్లలో చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. సిపిఎం నగర నాయకులు ఎస్‌డి ఖాజా పాష, మహబూబ్ బాష, చాంద్ బాష, బాబు, షేక్ బాబు, నూర్ బాష, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

రూ. 5 వేలు జరిమాన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పి పర్యవేక్షణలో కర్నూలు పోలీసులు ముద్దాయిలకు కఠిన శిక్షలకు గట్టి చర్యలు చేపట్టారు. నందికొట్కూరుకు చెందిన ముద్దాయి కురువ రవి, పగిడ్యాల మండలం గణపురం గ్రామానికి చెందిన కురువ వెంకట రమణ ఇద్దరూ స్నేహితులు కురువ రవి తన అవసరాల నిమిత్తం వెంకటరమణ వద్ద నుండి రూ. 16 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఎన్ని రోజులైనా ఇవ్వకపోవడంతో, వెంకటరమణ బాకీ చెల్లించమని రవిని తరచుగా అడుగుతుండేవాడు. తరుచూ అడుగుతున్నందున, ఎలాగైనా వెంకట రమణను చంపాలనే ఉద్దేశంతో రవి అతనిని తన అత్తగారి గ్రామమైన రుద్రవరానికి వస్తే డబ్బు ఇప్పిస్తానని పిలిపించాడు. సదరు వెంకట రమణను బి. తాండ్రపాడు గ్రామ సమీపంలో గల హంద్రీనీవా సృజల స్రవంతి కెనాల్ గట్టు దెగ్గరకు తీసుకుపోయి రవి తన వద్ద ఉన్న పిడిబాకుతో చంపేశాడు. సదరు ఘటనకు సంబందించి కురువ వెంకటరమణ తండ్రి అయిన కురువ చంద్రుడు ఫిర్యాదు మేరకుసిఆర్ నెంబర్ 41/2017 U/s 302, 201 ఐపిసి కింద కర్నూల్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో అప్పటి సిఐ సి.మహేశ్వర రెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. ప్రస్తుత కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీధర్ కేసుకు సంభందించిన సాక్షులను క్రమం తప్పకుండా వాయిదాలకు కోర్టులో హాజరు అయ్యేలా చూసి ముద్దాయికి శిక్ష పడేలా ప్రయత్నించారు. అన్ని కోణాల్లో విచారించిన జిల్లా న్యాయస్థానం వారు, ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఎబిఎన్ వీడియోగ్రాఫర్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్న సురేంద్రబాబు(35) అలియాస్ చిన్న మంగళవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున ఆయన ఇంటి వద్ద కుళాయి నీళ్లు పడుతుండగా ఆకస్మికంగా చాతిలో నొప్పి వచ్చింది. అక్కడినుండి ఆయనను కర్నూలు జిల్లా సర్వజన వైద్యశాల (జిజిహెచ్) కు ఆయన కుటుంబ సభ్యులు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. సురేంద్ర అంతకుముందు సీమ సిటీ కేబుల్‌లో కూడా వీడియోగ్రాఫర్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, కూతురు కుమారుడు తల్లిదండ్రులు ఉన్నారు.

మూడో పట్టణ సిఐ నివాళి : కర్నూలు మండలం, దిన్నెదేవరపాడు గ్రామంలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన ఎబిఎన్ న్యూస్ ఛానల్ కెమెరామెన్ సురేంద్రబాబు భౌతికకాయానికి కర్నూలు మూడో పట్టిణ సిఐ శేషయ్య నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పిల్లల చదువు పట్ల అవసరాలు ఉంటే తెలియజేయమన్నారు.



నివాళ్లులర్పిస్తున్న నాయకులు, (ఇన్‌సెట్‌లో సురేంద్ర బాబు అలియాస్ చిన్న(ఫైల్ ఫొటో)

సురేంద్రకు యుజెఎఫ్ నివాళి

కర్నూలు కార్పొరేషన్: సురేంద్ర (చిన్న)కు యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) కార్యదర్శి బి.చిన్న రామాంజనేయులు, అధ్యక్షులు నీలం సత్యనారాయణ ఆధ్వర్యంలో కర్నూలు బృందం దిన్నదేవర పాడులోని సురేంద్ర స్వగృహం వద్ద ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులు అర్పించారు. యుజెఎఫ్ కర్నూలు కమిటీ తమ ప్రగాఢ సంతాపం తెలిపిందన్నారు. ప్రభుత్వం సురేంద్ర కుటుంబానికి అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. యుజెఎఫ్ కోశాధికారి పి.యూసుఫ్ ఖాన్, సభ్యులు సాగర్, విజయ్ కుమార్, రాజశేఖర్, అసిఫ్, నాగరాజు, కిషోర్,జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

సురేంద్ర (చిన్న)మృతికి ఆవాజ్ కమిటీగా సంతాపం

సురేంద్ర కెమెరామెన్ చిన్న మతికి ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పి. ఇక్బాల్ హుస్సేన్ ,ఎస్ ఎం డి షరీఫ్ లు సంతాపాన్ని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. చిన్న అనతి కాలంలోనే కెమెరామెన్‌గా జర్నలిస్టుగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నాడని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కారం కోసం కృషి చేసిన వారిలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. సురేంద్ర చనిపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.

9 న రాష్ట్ర స్థాయి యోగ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

యోగ అసోసియేషన్ ఆఫ్ కర్నూల్ డిస్టిక్ ఆధ్వర్యంలో ఈనెల 9న నగర శివారులోని పెద్దపాడు వద్ద ఉన్న వేదాన్ష్ పాఠశాలలో ఒకటవ రాష్ట్ర స్థాయి యోగ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మంగళవారం తెలిపారు. 8 నుంచి 10 సంవత్సరాల లోపు ఒక కేటగిరీగా, 10 నుంచి 12 సంవత్సరాల లోపు బాల బాలికలకు మరో కేటగిరీగా, 12 సంవత్సరాల నుండి 14 సంవత్సరాలు మరో కేటగిరీగా, 14 నుంచి 16 సంవత్సరాలలోపు బాల బాలికలకు మరో కేటగిరీగా, 16 నుంచి 19 వరకు, 19 పైబడి 29 లోపు మరో కేటగిరీగా, 30 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాలు లోపు వారికి మరో కేటగిరి, 45 సంవత్సరాల పైబడిన వారికి మరో కేటగిరీగా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి సంబంధిత జిల్లా సంఘాల అధ్యక్ష కార్యదర్శుల అనుమతితో పోటీలకుహాజరు కావచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు 9391347212, 8885871715 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.


'ఉపాధి'ని వినియోగించుకోవాలి

- ఎంపిడిఒ ఎసి రాముడు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండలంలోని అనుగొండ గ్రామపంచాయతీలో మండలం పరిషత్ అభివృద్ధి అధికారి ఎసి రాముడు గ్రామ ప్రజలతో మంగళవారం సమావేశమయ్యారు. ఉపాధి హామీ పనులకు రావాల్సిందిగా గ్రామ ప్రజలకు, ఉపాధి హామీ కూలీలకు తెలిపారు. 100 రోజులు కూలీలకు ఉన్నతి ప్రోగ్రాం కింద శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం ఇవ్వనుందని వెల్లడించారు. స్త్రీలకు కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడింగ్ డిజైన్, టైలరింగ్ వంటివి అలాగే పురుషులకు సెల్ ఫోన్ మెకానిక్, డీజిల్ ఆటోమొబైల్స్ రంగాల్లో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వనున్నారని తెలిపారు. స్వయం ఉపాధితో ముందుకు వెళ్లాలని తెలియజేశారు.

ప్రపంచ సముద్రశాస్త్రవేత్త డాక్టర్ మద్దిలేటి రెడ్డి అస్తమయం



ఆకాశమంత వ్యక్తిత్వం, సముద్రమంత విజ్ఞానం కలిగి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన సముద్రశాస్త్రవేత్త డాక్టర్ ఎంపి.మద్దిలేటి రెడ్డి (95) కర్నూలులోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గత వారంరోజులుగా గొంతునొప్పి సమస్యతో బాధపడుతున్న ఆయన్ను చికిత్స నిమిత్తం చేర్చారు. మంగళవారం ఉదయం కోలుకోలేక వయోభారంవల్ల అనారోగ్యంతో పోరాడలేక తుదిశ్వాస వదిలారు.

(వార్త మెయిన్ పేజీలో...)

శ్రీ మఠంలో రథసప్తమి వేడుకలు

- పంచ రథోత్సవాల ఊరేగింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠంలో రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సూర్య భగవానుడి జన్మదిన సందర్భంగా రథ సప్తమిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు. అంతకు ముందు రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం బంగారు కవచంతో పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. తదనంతరం పంచ రథోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీమఠం మేనేజర్ వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్, సహాయక పీఆర్వో హెచ్చార్పి వ్యాసరాజాచార్ గురురాజ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రాలయంలో అంగరంగవైభవంగా పంచ రథోత్సవాల ఊరేగింపు

కబడ్డిలో ప్రతిభ

ప్రజాశక్తి-ఆదోని

కబడ్డీలో ఆదోని క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం ఆదోనిలో క్రీడాకారులను పలువురు అభినందించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి, ఫిలిప్ కబడ్డీ కోచ్ అమర్ ప్రకాష్ మాట్లాడారు. సీనియర్ క్రీడాకారుడు జగదీష్(దాని) జ్ఞాపకార్థం 24వ జాలి బ్రదర్స్ కబడ్డీ టోర్నమెంట్ తుంబూర్ తిరుపతి జిల్లా తమిళనాడు బార్డర్లో ఈనెల ఒకటి నుండి 3 వరకు నిర్వహించారన్నారు. ఇందులో 40 టీంలు పాల్గొన్నాయన్నారు. టోర్నీలో ఆదోని ఫిలిప్స్ కబాడీ టీం క్వాటర్లో తమిళనాడు జట్టుపై గెలిచి సెమీ ఫైనల్లోకి వెళ్లిందన్నారు. కాకినాడ కబడ్డీ అకాడమీ ప్లేయర్స్ పై ఆరు పాయింట్లతో ఓడి, హోమ్ టీం చిత్తూర్తో ఆడి నాలుగో బహుమతి రూ.15000 కైవసం చేసుకుందన్నారు. అందులో మూడు అడుగుల కప్పు సాధించారన్నారు.



ఆదోని ఫిలిప్స్ కబాడీ టీం నాలుగో బహుమతి సాధించినందుకు. ఫిలిప్ కబడ్డీ సీనియర్స్ ప్లేయర్స్ అమర్ ప్రకాష్, రామంజి, మారి, జయరాం, దుబ్బు, గోపి, నాగరాజ్, రవి, రాజు, గోవింద, పరిష, పెద్ద ఎల్లప్ప, జూనియర్ ప్లేయర్స్ను అభినందించారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

- ఒప్పందాలను అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని గత ప్రభుత్వం యూనియన్ నాయకులతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ ఆశా వర్కర్లతో శరీన్ నగర్లో సమావేశం నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప, జి.ఏసు మాట్లాడుతూ ఆశా వర్కర్లను సచివాలయాలకు బదిలీ చేసిన తర్వాత పని భారం పెరిగిందన్నారు. గతంలో 1500 జనాభాకు ఒక ఆశా ఉండే వారని ప్రస్తుతం 2 వేల నుండి 3 వేల వరకు జనాభా ఉందని తెలిపారు. కనీస సెలవులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని, డ్యూటీలు కచ్చితంగా చేయాలని లేదా మీ స్థానంలో వేరే వారిని నియమించాలని కండిషన్లతో పని చేయిస్తున్నారన్నారు. దాని వల్ల పని భారం పెరిగి ఆశ వర్కర్ల పై ఒత్తిడి పడుతుందని తెలిపారు. ప్రభుత్వం చేప డుతున్న సర్వే పనులు ఆశ వర్కర్లకు అప్ప గిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఆశ వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని, అదనపు పనులు అప్పగించ బోమని పని భారం తగ్గిస్తామని, వేతనాలు అరికడతామని అనేక వాగ్దానాలు చేసిం దన్నారు. వాటిని వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పై డిమాండ్లపై స్పందించకుంటే మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు. ఆశ వర్కర్లు లక్ష్మీ, రేణుక, రజిని , మద్దమ్మ, రాణి, జ్యోతి, షహనాజ్, కృష్ణవేణి, భారతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుధాకరప్ప



స్మశాన వాటికను ఆక్రమణ నుంచి కాపాడండి

- హద్దులు వేయించాలని గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని చెట్నిహళ్లి గ్రామంలో ఆక్రమణకు గురైన స్మశాన వాటికను విడిపించి హద్దులు వేయించాలని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న సిఐ రామాంజులు ఎస్సై శివాంజల్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని గ్రామస్తులతో సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహసీల్దార్ ఎస్.రవికి వినతి పత్రాన్ని అందజేశారు. టిడిపి నాయకులు చేవల నాగేష్, మేకల మల్లేష్ మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా సర్వే నెంబరు 113, 114లో 2.30 ఎకరాల భూమిలో మృతి చెందిన వారిని ఖననం చేస్తున్నామని, వైసిపి ప్రభుత్వంలో అదే సర్వే నెంబరులో ఒక వైపు జగనన్న కాలనీ అంటూ ఇళ్లు నిర్మించి ఇచ్చారని, దాన్ని అదునుగా చేసుకుని స్మశాన వాటికను ఆక్రమించి వారి కోసం కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసిందని తహసీల్దార్కు వివరించారు. పూర్వం నుంచి ఉన్న స్మశాన వాటికకు హద్దులు వేసి ఇవ్వాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ మండల సర్వేయర్ ఆశోక్ తో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజినయ్య, ఉప సర్పంచ్ వీరనాగప్ప, ఎంపిటిసి సభ్యులు రామాంజనేయులు, మాజీ సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ అల్లింగప్ప పాల్గొన్నారు.



- హద్దులు వేయించాలని గ్రామస్తుల ఆందోళన

ప్రభుత్వ పాఠశాల కార్మికులకు రూ.12వేలివ్వాలి

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.12000 ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాముడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న నైట్ వాచ్మెన్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికులు కేవలం రూ.3 వేల నుండి రూ.6 వేల వరకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్లో నిత్యవసర దరకులు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గుర్తించి కనీస వేతనం రూ.12000 పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి పని భద్రత లేదని, గుర్తింపు కార్డులు అందజేయాలని, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, బీమా సౌకర్యం, యూనిఫామ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీరి అమలు చేయాలన్నారు. ఎంఇఒ ఆంజనేయులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. యుకె కవిత, సి.లక్ష్మి, ఆశీర్వాదమ్మ, రామలక్ష్మి, సి.నారాయణ, ప్రభాకర్, నరసింహులు, ఎం.బాష, రాముడు, కులుసుంబి, నాగరాజు, లక్ష్మి, వలి, సిఐటియు నాయకులు పి.రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకుడు రాముడు , తదితరులు

ఘనంగా సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో రథసప్తమి సందర్భంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఆయల నిర్వాహకులు మంగళవారం సామూహిక వివాహాలు నిర్వహించారు. కార్య క్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆదికృష్ణమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఎంపిపి దానమ్మ, పంపాపతి, టిడిపి నాయకులు బజారప్ప, రాగప్ప, సోమ్మన్న, మధు, రాఘవరెడ్డి, సిద్ద, మహాలింగ భరత్, విజయ్, హరి పాల్గొన్నారు.



సామూహిక వివాహాల్లో ఆదిగుడిసె కృష్ణమ్మ


హైదరాబాద్కు మాదిగలు డప్పులతో తరలాలి

- ఎమ్మార్పీఎస్ పిలుపు

ప్రజాశక్తి - నందవరం

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న హైదరాబాద్లో నిర్వహించే "లక్షల డప్పులు, వేల గొంతులు" కార్యక్రమానికి మాదిగలు,ఇతర ఉప కులాలు వేలాదిగా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జి.ఆనంద్ చైతన్య,జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి మహదేవ్ మాదిగలు పిలుపునిచ్చారు. మంగళవారం నందవరం మండల పరిధిలో ముగతి,హాలహార్వి గ్రామాలలో డప్పుల దరువు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే దుష్టశక్తుల గుండెల్లో మాదిగ డప్పుల మోతలతో ఉక్కిరి బిక్కిరి చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాలలోని మాదిగలు ప్రతి ఇంటి నుండి డప్పులు తీసుకొని తరలి రావాలని కోరారు. హాలహార్వి ఎంఆర్పిఎస్ నాయకులు మద్రి ప్రభుదాసు, బూదూరు ప్రకాశం, చక్కర ఎర్రన్న, మద్రి డేవిడ్, సంసోను పాల్గొన్నారు.





ఈరన్న స్వామి సన్నిధిలో చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో గొర్రెల సహకార సంఘం జిల్లా చైర్మన్ శ్రీనివాసులు పూజలు చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కుంభాభిషేక మహోత్సవం భక్తుల ఆధ్వర్యంలో అధికారులు ఘనంగా నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో గొర్రెల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ రాముడు, కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామ గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు నరసింహులు ,కుంభలూరు గ్రామ సర్పంచ్ వీరేశులు కలిసి చైర్మన్ శ్రీనివాసులను సన్మానించారు.

భర్త మరణిస్తే భార్యకు పింఛను

ప్రజాశక్తి - దేవనకొండ

ఎన్టీఆర్ భరోసా పింఛను తీసుకుంటూ భర్త మరణిస్తే తక్షణమే భార్యకు పింఛను అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, జనసేన నాయకులు ఉచ్చిరప్ప, రామాంజనేయులు పేర్కొన్నారు. గత నెలలో పింఛను తీసుకుంటూ అనారోగ్యంతో భర్తలు చనిపోయిన ముగ్గురు వితంతువులకు మంగళశారం పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రఫీ, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేశ్వరి, స్థానిక టిడిపి కార్యకర్తలు రహిమాన్, బాలు, హనుమంతు పాల్గొన్నారు.

బిసి వర్గాల నుంచి రక్షణ కల్పించాలి

- తగరం ప్రసాద్తో కలిసి ఎస్ఐకి దళితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండల పరిధిలోని చెట్నిహళ్లి గ్రామానికి చెందిన బిసి వర్గాల నుంచి తమకు రక్షణ కల్పించాలని అదే గ్రామానికి చెందిన తగరం ప్రసాద్తో కలిసి దళితులు స్థానిక పోలీస్టేషన్లో ఎస్ఐ శివాంజల్కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబర్ 113లో 1.50 సీలింగ్, రస్తా పరంబోక భూమి దళితుల ఇల్ల మధ్యన ఉందన్నారు. ఈ భూమిలో దళితులు 100ఏళ్ల నుండి గడ్డివాములు వేసుకుంటూ నివసిస్తున్నారని తెలిపారు. దళితులకు ఇళ్ల పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామానికి స్మశాన వాటిక లేకపోవడంతో అందరూ శవాలు ఇక్కడే పూడ్చడంతో దళితులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. 2018లో ప్రభుత్వ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటే సర్వే నెంబర్ 125, 126లో 3. 54 సెంట్లను అన్ని కులాల వారికి స్మశాన వాటికకు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి మా గ్రామస్తులు అక్కడే ఖననం చేసేవారని, మా గ్రామ బీసీ కులాలు కులహంకారంతో దౌర్జన్యంగా సర్వే నెం. 113లోనే శవాలను పూడ్చడం, కళేబారాలను ఇళ్ళ ముందు పడేసి పోయేవారని చెప్పారు. ఈ నెల 2న బీసీ కులాల వారు అదే సర్వే నెంబర్లోని భూమిని అక్రమంగా జెసిబితో కబ్జా చేయడానికి చూస్తే మేము అడ్డుకున్నామని ఎస్ఐకి వివరించారు. ఈ నెల 4న సర్వే నంబర్ 113 స్థలంలో నేను నిలబడి ఉండగా ఒక్కసారిగా 50 మంది బీసీ కులాల రౌడీ మూకలు వేట కొడవళ్ళు, కత్తులు, కర్రలు, గొడ్డళ్లు, గడ్డపారలు తీసుకొని బహిరంగంగా చంపడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. నేను కేకలు పెట్టగా చుట్టుపక్కల ఉన్న మా దళితులందరూ వచ్చి ప్రాణాపాయాల నుండి నన్ను కాపాడారని తెలిపారు. దుర్భాషలాడిన వారి పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐకి వివరించారు. వెంటనే వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదుదారుల వెంట జైభీమ్, ఎమ్మార్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ తదితరులు ఉన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

- మరో రెండు పార్కులు ఏర్పాటు
- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించే విధంగా పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మాచాని సోమప్ప (పెద్ద పార్క్)ను ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో వాకింగ్ ట్రాక్లను ఏర్పాటుకు సోమప్ప సర్కిల్ వద్ద రహదారులను పరిశీలించారు. పార్క్ అభివృద్ధికి, కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు ఏర్పాటు గురించి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ఉన్న పార్కులను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే విధంగా తయారు చేస్తామని తెలిపారు. అలాగే పట్టణంలోని మరో రెండు పార్కులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్కులో కావాల్సిన సౌకర్యాలు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఉదయం పూట ప్రజలు వచ్చే వాకింగ్కు, వ్యాయామంకు కావలసిన ఏర్పాట్ల గురించి చర్చించినట్లు తెలిపారు. అలాగే ప్రధాన రహదారుల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభివద్ధి పనులను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి- కౌతాళం

కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపిడిఒ సుబ్బరాజు పరిశీలించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్ను, ఆప్షన్ త్రీ కాంట్రాక్టర్ పెంచల్రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మహమ్మద్ రఫీతో కలసి వివిధ దశలలో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇదే గ్రామ పంచాయతీలో నిర్మాణ దశలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కుంటనహాళ్లో హౌసింగ్ లేఔట్నకు సంబంధించి మొత్తం 89 ఇల్లు మంజూరయ్యాయని , వీటన్నింటినీ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తిచే చేయాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి సంబంధించి ఇంకనూ మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఎంఐఎస్ ఇన్చార్జి శ్రీనివాస నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నూర్బాష తదితరులు పాల్గొన్నారు.





ఉద్యోగాలకు ఎంపికయిన అభ్యర్థులతో స్కిల్ డెవలప్మెంట్ అధికారులు

జాబ్ మేళాలో 36 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఆలూరు

ఎపి నైపుణ్యాభివృద్ధి,శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 36 మంది ఎంపికైనట్లు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఎల్.ఆనంద్రాజ్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో సన్ కిషన్ అగ్రి అండ్ కో ,క్రెడిట్ యాక్సెస్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించగా నిరుద్యోగ యువతీ యువకులు 71 మంది పాల్గొనగా వీరిలో 36 మంది ఉద్యోగులు ఎంపికయినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న నిరుద్యోగులు ఉద్యోగంలో చేరాలన్నారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ వీరేష్, స్కిల్ హబ్ ట్రైనర్ మన్సూర్ అలీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, నైపుణ్యాభివదిఅండ్ శిక్షణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-చిప్పగిరి: ఇంటి పన్నులు , నీటి పన్నులు చెల్లించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని 13 గ్రామ పంచాయతీల ప్రజలకు ఇఒఆర్డి బాలన్న తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాలకు వివిధ రకాల పన్నుల ద్వారా నిధులను సమకూర్చుకుంటేనే ఇలాంటి సమస్యలను పరిష్కరించుకోగలుగుతామన్నారు. పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బంది సహకరించి ప్రతి గ్రామంలో కూడా 100 శాతం పన్నులు వసూలు అయ్యేలా కృషి చేయాలన్నారు. నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి తాగునీటి సమస్య రాకుండా పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగి రామచంద్రారెడ్డి మృతి

ప్రజాశక్తి - మద్దికేర

మద్దికేర మండల కేంద్రంలోని విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న రామచంద్ర రెడ్డి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పలువురు నేతలు రామచంద్ర రెడ్డి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామచంద్ర రెడ్డి విద్యుత్ శాఖలో 20ఏళ్ల పని చేసినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఆయన కుటుంబానికి రూ. 58వేల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ప్రజాశక్తి,-హొళగుంద

రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన పెద్దహ్యాట గ్రామంలో జరిగే రీ సర్వే ప్రక్రియను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం పరిశీలించారు. రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. చిన్న హ్యాట గ్రామంలోని సచివాలయన్ని పరిశీలించారు. అనంతరం హొళగుంద తహసీల్దార్ కార్యాలయానికి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వి ఆర్ఒలు ఆయా సంబంధిత గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేని పక్షంలో కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. తహశీల్దార్ నిజాముద్దీన్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ (ఇన్చార్జి) శ్రీనివాసులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎపి ఎన్జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎపిఎన్జిఒ 2025 క్యాలెండర్ను జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డును తీసుకోవడంతో ఆ సంఘం నేతలు కలెక్టర్కు అభినందనలు తెలిపారు. క్యాలెండర్ ఆవిష్కరణలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంగల్ రెడ్డి, జిల్లా ఇన్ఛార్జీ కార్యదర్శి కెసిహెచ్ కృష్ణుడు, నగర అధ్యక్షులు ఎం. కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, టైపిస్టు, స్టెనో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం చైర్మన్ చందన, ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బంగారి, ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, రాజేష్ పాల్గొన్నారు.



IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI I.A.No.22/2020 IN A.S.No.4/2020 & A.S.NO.4/2020

Between:-
Sekhupati Pinjari Kasamma & others.
... Petitioners/Appellants
Vs
Sekhupati Pinjari Pedda Peeramma & others.
...Respondents/Respondents

TO
R8) Chinna Peeramma d/o late Dasthagiri, Agriculturist, resident of Devanakonda Village & Mandalam in Kurnool District
R11) Peeru Sab s/o Peeranna resident of Badinehal village in Kowthalam Mandal In Kurnool District.

Please take notice that the above-named Petitioners/Appellants filed the above appeal against you and other respondents to set aside the Judgement and decree of the lower court passed in O.S.No. 101/2013 by allowing the appeal and also filed the above I.A. to stay of all preliminary decree proceedings till the disposal of the above appeal. You are hereby informed to appear before this Hon'ble Court on 05.02.2025 at 10.30 A.M. in person or through Pleader to file your claim objection failing which the matter will be decided and set exparte against all of you.

B.C.NARASIMHULU
ADVOCATE FOR PETITIONERS/ APPELLANTS "

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : ADONI I.P.NO.4/2016

Between :
K.Sreenivasa Rao S/o Late K.Gokari Rao
Aged about 42 years Hindu Cultivator
Resident of Gonegandla (V) and Mandalam
Kurnool Dist. ...Petitioner

And

1. D.Ramudu S/o Hanumanna
Hindu, aged about 62 years,
Hindu Cultivator
Kodumur (V) and mandalam, Kurnool (Dist)
2. Kummari Narasimhulu
S/o Kummmari Kumar,
Hindu aged about 25 years, Driver,
H.No.1/251-A, Parla palli village,
Yemmiganur (M), Kurnool Dist
3. S.Manjunath S/o Ramalingappa
Hindu, aged about 39 yeras
R/o H.No. 2/57, Mugathi (V),
Nandavaram (M), Kurnool Dist.
4. D.Veeresh S/o D.Lakshmanna
Hindu aged about 34 yers
R/o H.No.9/11370/2, Sivanna nagar,
Yemmiganur town
5. D.Latha W/o Nageswara Rao
Hindu aged about 50 years
R/o D.No. 1/2260/1, Wewars Colony,
Yemmiganur town,
6. D.Meenakshi Bai W/o D.Nagaraju Rao
Hindu, aged about 65 years Housewife
R/o D.No.15/418-8 Y.M.K.Colony, Adoni.
...Respondents

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా నా యొక్క క్లయింట్/వాది అయిన మేము ఆదవాని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఐ.పి.నెం.4/2016 కేసు వేసినారు. ప్రతివాది అయిన మీరు కోర్టులో హాజరు నిమిత్తము తేది 28/3/2025 ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. కావున మీరు స్వయంగా గాని లేది వకీలు ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 28-03-2025

టి.మల్లేష్,
టి.వీరస్వామి
అడ్వోకెట్సు, ఆదోని/ఎమ్మిగనూరు.
సెల్ : 6301553292, 9912266019